# నిద్ర మేనర్స్ |

నిద్ర ఆడదానికి అలంకారం. స్లీపింగ్ బ్యూటీ అని నిర్దిస్తున్న "స్త్రీ" సౌందర్యాన్ని కవులు చొంగ కారుస్తూ మెచ్చుకున్నారు. బస్సుల లోనూ, రైళ్ళలోనూ నిద్రపోయే అమాంబాపతు సరుకును స్లీపింగ్ బ్యూటీస్‌లోకి జమ కట్టడానికి వీల్లేదు. పూర్వం చెట్లక్రింద నిద్రపోయే రాకుమారుల్ని అంతఃపుర కాంతల చెలికత్తెలు మేల్కొలిపి నిజ మనో మర్మములు తెలుసుకొన్నట్లు— బస్సులలోనూ, రైళ్ళలోనూ పడి నిద్ర పోయే ప్యాసింజెర్లను కండక్టరూ, టికెట్ కలెక్టరూ లేపి చెక్ చేస్తూ వుంటారు.

స్త్రీ జాతి మేల్కొవాలి, స్త్రీ జాతి మేల్కొవాలి అని కొంద రంటారు కాని అదే వంత "ఈజీ" కాదు. అసలు స్త్రీ జాతికి నిద్రంటే యిష్టం. జోలపాడేది చిచ్చి కొట్టేది ఎవరు? జాతిని నిద్రపుచ్చేది నిద్రమేల్కొల్పేదికూడా స్త్రీలే! నిద్రపోకుండా రాత్రల్లా మేల్కొన్న ఆడదాన్ని చూస్తే తాటకినో, ఘాతకినో దాని కజిన్నో సిస్టర్నో చూచినట్లు భయం వేస్తుంది.

చీకటిపడగానే మంచం నవారు బిగించి పరుపుసర్ది దుప్పట్లను దులిపి పక్కలు వేస్తారెందుకు? పడకగది నీటుగా, షోగ్గా కొండొకచో ఫల పుష్పభరితంగా నానావిధ అగరు ధూప సుగంధాది ద్రవ్యాలతోనూ గోడల్ని నగ్న అతినగ్న మహానగ్న చిత్రపటాలతోనూ, ఫొటోలతోనూ దేవుళ్ళతోనూ అలంకరిస్తారెందుకు? మనం కళ్లుమూసుకున్నాక మనకీ లోకంతో నిమిత్తం లేదు కదా! అందుకే తెలివైనవాళ్ళు "లోకముతో మనకేటికి లోలాక్షీ రా పోనము" అంటారు.

స్త్రీజాతి మేల్కోవాలి, స్త్రీజాతి మేల్కోవాలి అని నిద్రపోనివ్వకుండా వాళ్ళని బాధపెట్టడం అన్యాయం అంటాన్నేను. మేల్కొన్న బ్యూటీకి మన సొసైటీలో అడుగడుగునా డేంజరుంది కనుక నిద్రే అడదానికి నిక్షేపమైన అలంకారం. అందుకే అతివలు నడుం నిలవక ఎక్కడ పడితే అక్కడ నడుం వాలుస్తారు. మేల్కొంటే ట్వంటీ ఫోరవర్సూ వారిచేత చాకిరీ చేయించుకోడానికి సొసైటీ రడీగా వుంటుంది. నిద్రపోయేవేళ ధరించటానికి నిద్రచీరలు పల్చగా మెత్తగా సుఖంగా వుండేవి తెమ్మని ఆడవాళ్ళు గోల చేస్తుంటారు. కట్టుడు చీరలని పెట్టుడు చీరలని చీరలు రెండురకాలు. అందులో కట్టుడు చీరల్లో మళ్ళీ సాయంత్రం చీరలని ఒక వెరైటీ వుంటాయి. ఈ సాయంత్రం చీరలే నిద్రచీరలు. నిద్రచీరలనగా చీరలు నిద్రపోతాయనికాదు అర్థం. చీరలూ, లాల్చీలు, పంచెలూ ఏవీ నిద్రపోవు. కోరికలూనిద్రపోవు. నిద్రపోయే మగాళ్ళని నిద్రారాక్షసు లంటారు. పట్టినంత తిని పట్టిమంచంమీద పవ్వళించకుండా తిండి ఎక్కువైతే నిద్ర ఎక్కువవుతుందని ప్యూర్ జలసీతో కూడుకున్నటువంటి మాటను అంటూవుంటారు.

మన పెళ్ళిళ్ళలోకూడా మూడు నిద్రలే చేయాలంటారు. ముప్పయి నిద్రలు ఎందుకు చేయకూడదూ అని మనసులో వున్నా, పై కనకూడదు పెళ్ళికూతురుగాని, పెళ్ళికొడుకుగాని. అన్నీ వాళ్ళు చెప్పినట్లే చేయాలి. యిప్పుడు పెళ్ళవగానే రైళ్ళలోనే నిద్రలుకనుక, మూడ్నిద్దర్ల ముచ్చట్లు కొంత కట్ చేశారనుకుంటా. నిద్రపట్టని అమ్మలక్కలు చిమ్మెటల్లా అక్కడి దిక్కడా ఇక్కడి దక్కడా రాత్రల్లా సర్దుతూ వుంటారు. అతి సర్దుడు, మహా సర్దుడు అని సర్దుళ్ళలో రెండు వెరైటీ లున్నాయి. మళ్ళీ శుభ్రాల్లోకూడా అతిశుభ్రం మహాశుభ్రం అని రెండురకాలు. కడిగిందే కడుగుతూ, తుడిచిందే తుడిచిందే తుడుస్తూ ఎప్పుడూ అలుగ్గుడ్డా, చీపురూ, బాల్చీతో ప్రత్యక్షమయే తుడుపులమ్మలు మధ్యతరగతి సంసారాల్లో కోకొల్లలు, ఈ తుడుపులమ్మలే సర్దుమణిగేదాకా సర్దుతూ వుంటారు.

మా చుట్టాల్లో ఒకావిడ కుంకుడుకాయ పులుసుతో మెట్లు కడుగుతుంది. బార్ సబ్బుతో బాత్‌రూమ్ ఫ్లోర్. లక్స్ సబ్బుతో స్టవ్వూ కడిగేస్తుంది. ఆవిడ బడ్జెట్లో యాభై రూపాయలు సబ్బుల క్రింద ఖర్చు .... .... అందుకే ఆడాళ్ళు మగాళ్ళకి జడపదార్థాల్లాగవుపిస్తారు. (ఆడాళ్ళు జడ పదార్థాలూ, ముడిపదార్థాలూ అని రెండు రకాలు) పూర్వ కాలం స్త్రీలకు విశేషంగా ఆభరణాల్ని తగిలించి గంగిరెద్దుల్లా తయారు చేయటంలోని వుద్దేశం వాళ్ళు ఏపనిలో వున్నా ఆ చప్పుళ్ళద్వారా "బిజీ"గా వున్నట్లు తెలుసుకోవాలనే– పెరుగు చిలికే టప్పుడు పాలు పితికేటప్పుడు తిరగలి విసిరే టప్పుడు, పుట్టే ధ్వనులు వాటి టైమింగ్ అప్పుడు వాళ్ళు పాడుకునేపాటలు స్త్రీ శ్రామిక జీవనా విర్భూత మంగళ తూర్యారావాలు. దంపుళ్ళపాటలు దంచడంలోని శ్రమను మైమరపింప చేస్తాయి కదా— ఇప్పుడీ సోకాల్డ్ మోడ్రన్ ఎడ్యుకేటెడ్ గరల్స్ రేడియో తిప్పుకుంటున్నారు. అసలు ఆడాళ్ళు పాడుకోవటం మానేశాకే పాడయ్యారు. పాటలకు మన జీవితంలో వుండే సంబంధాన్ని తెంచివేసుకున్నాము. రొటీన్ జీవితంలోంచి సంగీతం నిష్క్రమించింది. మా చిన్నప్పుడు ఆడ పిల్లలం అందరం ఒకచోట కూర్చుని పాటలు పాడుకునేవాళ్ళం. కొత్త పాటలు నేర్చుకునే వాళ్ళం. ఎవళ్ళింట్లో అయినా పేరంటమైతే పెంకు లెగిరిపోయేలా పాటలు పాడి వాయినాలుచ్చుకుని మెళ్ళో గంధం నుదుటను బొట్టుమీద బొట్టు బారెడు బారెడు జడల్ను(జడ పదార్థాలంకదా మేము) పూసుకుంటూ రోడ్డంతా కలకల్లాడి పోయేట్లు నడిచి వచ్చేవాళ్ళం. ఆ సరదాలు ఆ సంగీతమూ జీవితంలోంచి ఎటో చెప్పకుండా వెళ్ళిపోయాయి, రేడియో- సినిమా- యివి రెండే మన బ్రతుకుల్ని ఏలుతున్నాయి, మన నోళ్ళు మూతపడ్డాక, మనం పాడుకోలేక పోయాక, ఎవరెంత గొప్పగా పాడితే మట్టుకు మనకదేం గొప్ప? ఇప్పుడు "డియ్యో-డియ్యో" "కుయ్యో-కుయ్యో" అంటూ మొత్తం సినిమా నిండా ఉద్రేకప్పాటలే పెడుతున్నారు కదా! ఆ పాటలు యింట్లో

ఆడపిల్లలు పాడుకోవటానికి ఏం బాగుంటాయి? చివరకు సినిమావాళ్లు కూడా తెలుగు జీవితంలో నుంచి తెలుగును తగ్గించి తప్పించేస్తున్నారు. "దోచుకో" "దాచుకో" పాటలు "మగసిరి-గడసరి-సొగసరి-సరిసరి-సిరి-సిరి" అంటూ అవే మాటల్ని పిల్లి మంత్రించి రాసి అమ్ముకోడానికి కవులకు సిగ్గు వేయటంలేదా? సంగీతాన్ని, సాహిత్యాన్ని, అన్ని లలిత కళల్నీ చెడగొట్టడానికి సినిమా కంకణం కట్టుకుంది. తెలుగు సినిమాలు తెలుగు వాళ్ళ నిష్ట దరిద్రానికి నిత్యోపమానాలు.

దొరలన్నీ పద్ధతి ప్రకారం చేస్తారుష. వాళ్ళకు "నిద్ర మేనర్స్" అని వున్నాయి. నిద్రపోయే ముందు గుడ్ నైట్ చెప్పి "ముద్దెట్టు" కుంటారు. మళ్ళీ తెల్లారి లేస్తూనే 'హవ్ డూ యు డూ'— "రాత్రి బాగా నిద్ర పట్టిందా" అని అడుగుతారు. ఒహప్పుడీ నిద్ర మేనర్స్ మరీ అడుగు దాటరాని ఆచారంలా కనిపించి "సిల్లీ"గా తోచినా "గుడ్ నైట్" చెప్పడం (ముద్దులెట్టుకోడం మినహా) మంచివే! పిల్లలంతావచ్చి డాడీకి గుడ్ నైట్ చెప్పి "కిస్" చేసి పోతూంటారు. అవన్నీ బానే ఉంటాయికాని "యిమిటేట్" చేస్తే అందులో "ఛాం" వుండదు. టెల్గూ సిన్మాలు అందుకే బావుండటం మానేసి చాలా కాలం అయింది. మన జాతిని నిద్రపుచ్చడానికి చవకబారు నిద్రమాత్రలు టెల్గూ సిన్మాస్ అండ్ ది టెల్గూ పత్రికల్సు....అబ్బ-నిద్దరొస్తూందండీ! గుడ్ నైట్!